కాంగ్రెస్ రైతులను ఆగం చేయాలని చూస్తుంది

గాంధారి, నవంబర్ 20: మూడు గంటల కరెంట్ ఇస్తానంటున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులకు కష్టాలు తప్పవు .గతంలో కరెంట్ ఎప్పుడు వస్తుందెనో, ఎప్పుడు పోతుందెనో తెలిసేది కాదు. దీంతో పాలిన మడే పారేది. కేసీఆర్ పాలనలో రైతులకు 24గంటలపాటు కరెంట్ ఇస్తుంది. ఇప్పుడు రైతులం రెండు పంటలు పండిస్తున్నాం. కొత్తగా కాంగ్రెసోళ్లు వచ్చి చేసేదేమీ లేదు. కొత్తకొత్త మాటలు చెప్పి... రైతులను ఆగం చేయాలని చూస్తున్నది.

- ఒలియం ఆసిఫ్ అలీ, రైతు, గండివేట్, గాంధారి

కాంగ్రెస్ వస్తే.. కరెంటు బాధలే..

గాంధారి, నవంబర్ 20: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ కరెంటు తిప్పలు తప్పవు. రాత్రిపూట పొలాలకు పోవాల్సిన పరిస్థితి వస్తుంది. మూడు గంటలు కరెంటు ఇస్తే... పొలాలు సరిగ్గా పండక.. అప్పులపాలవుతాం. 10హెచ్‌పీ మోటర్లు కొనాలంటే రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందంట. ఆ పైసలు ఎక్కడి నుంచి తేవాలి. ఇప్పుడు సీఎం కేసీఆర్ పాలనలో 24గంటల పాటు కరెంట్ ఇస్తుండు. ఏ మోటరు మార్చాల్సిన పనిలేదు. రాత్రిపూట బోర్లు స్టార్ట్ చేయడానికి పోవాల్సిన బాధతప్పింది. కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు, వస్తుందెనో తెలిసేది కాదు. పంటలు ఎండిపోయి, బోరు మోటర్లు కాలిపోయేవి. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే కరెంట్ బాధలు వస్తాయి.

- సిద్ధు, రైతు, రాంలక్ష్మణ్‌పల్లి, గాంధారి

రైతులు బాగుంటే కాంగ్రెస్‌కు నచ్చదా?

గాంధారి, నవంబర్ 20: సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు సరఫరాతో నాలాంటి యువకులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. బీఆర్ ఎస్ పాలనలో రైతులకు అన్నివిధాలా మేలు జరుగుతుంది. మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లని చెబుతున్న కాంగ్రెస్ పార్టీతో రైతులకు నష్టమే. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటలు కూడా పారే అవకాశం ఉండదు. 10హెచ్‌పీ మోటర్లను విప్పుకొని ఏం చెయ్యాలి. ఇప్పుడున్న మోటర్లు పనిచేస్తలేవా? మంచిగా ఎవ్వసం చేసుకుంటున్న రైతులు బాగుపడితే కాంగ్రెస్ నచ్చేటట్లు లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయం చేయాలంటే ఇబ్బందులే వస్తాయి.

- కోరబోయిన నాగరాజు, రైతు, గౌరారం, గాంధారి

మా బతుకులు పాలంలనే..

వ్యవసాయానికి 3గంటల కరెంట్ ఇస్తే మా బతుకులు పాలంలనే తెల్లార్తయి. ఎప్పుడు కరెంటు వస్తదో.. పాలం పారవెట్టుకుందామా అని పొలంలనే ఉండవడ్డది. ఓ నాలుగు ఇసాల పొలం ఉన్నోనికైతే 3గంటల కరెంటు సాల్దది. మరి మిగతోల్లపన ఉత్తదే. బిల్లింగ్‌లల్ల కూసొండి, వ్యవసాయం గురించి మాట్లాడితే గిట్లనే ఉంటది. ఇప్పుడింక 10హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని ఉచిత సలహా ఇస్తుండ్రు. ఇప్పుడున్న బోర్లు సరిగ్గా నడుస్తున్నాయి కదా. మరి మళ్లా 10హెచ్‌పీ మోటర్లు కొనమని చెప్పుడు చూస్తుంటె. రైతుల నెత్తి మీద ఖర్చు పడాలని ఈ కాంగ్రెస్ చూస్తున్నట్లు అనిపిస్తుంది. మా పొలాలు పండుతున్నాయి.. నీళ్లు పారుతున్నాయి.. మేమంతా మంచిగానే ఉన్నాం. మీ అధికారం కోసం ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరైంది కాదు.

- భూంశెట్టి భూషణ్, పోసానిపల్లి

10 హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు ఉంటయా?

మన దగ్గర 5హెచ్‌పీ మోటర్లు అయితే మస్తు అయితది. మూడు గంటలల్ల ఒక్కసారే మస్తు నీళ్లు గుంజి పొలంల పారవెట్టాలని 10 హెచ్‌పీల మోటర్లు పెడితే బోర్ల ఉన్న నీళ్లన్నీ ఒక్కసారికే ఖతం అయిపోతాయి. బోరు వట్టిపోతది. చెరువులు, కాలువల నుంచి నీళ్లు తెచ్చుకునేటోళ్లకు మాత్రమే 10హెచ్‌పీ మోటర్లు పనిజేస్తయ్. మోటర్లు మోతాదులు పోస్తేనే ఊట సరిగ్గా వచ్చి పొలం పారుతది. ఇప్పుడు కొత్తగా మోటర్లు, వైర్లు, స్టార్టర్లు ఇట్ల అన్నీ కొనాలంటే రైతులను ఖర్చు పెట్టించాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు కనిపిస్తున్నది. రైతుల క్షేమం గురించి ఆలోచించే కేసీఆర్ ఎక్కడ.. రైతులను ముంచాలని చూస్తున్న కాంగ్రెస్ ఎక్కడ. రైతును మంచిగ చూసుకునే కేసీఆర్ ఉండేనే ఎవ్వసం మంచిగ ఉంటుంది.

- చిన్నం హన్మంత్‌రెడ్డి, రైతు, సోమార్‌పేట్

కాంగ్రెస్‌తో కష్టాలే..

బీఆర్ఎస్ హయాంలో ఎవ్వసానికి 24 గంటల కరెంటు ఇవ్వడంతో పంటలు పుష్కలంగా పండుతున్నాయి. తెలంగాణ వచ్చిన తర్వాతే రైతుల తలరాత మారింది. కాంగ్రెసోళ్ల పాలనలో కరెంటు కోతలతో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు కొత్తగా వాళ్లకు అధికారం ఇస్తే 10 హెచ్‌పీ మోటరు, పైపులను రైతులతో కొనిపిచ్చేటట్లు ఉన్నారు. ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మనతోనే రిపేర్ చేయించేట్లుగా కనిపిస్తున్నది. ప్రకాంతంగా పంటలు పండించుకుంటున్న రైతులను మధ్యపెట్టి.. రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ఓటెందుకు వెయ్యాలి. కష్టాలపాలవ్వడానికా?

- గాదె తిరుపతి, రైతు, ఎల్లారెడ్డి

మూడు గంటల్ల ఓ మూల కూడా పారదు..

గాంధారి, నవంబర్ 20: మూడు గంటల కరెంట్‌తో రైతులం పంటలు పండించలేము. ఇప్పుడు కేసీఆర్ పాలనలో 24 గంటల పాటు కరెంట్ వస్తుంది. బోర్లపై ఆధారపడే రైతులం సంతోషంగా వ్యవసాయం చేస్తున్నాం. కాంగ్రెసోళ్ల పాలనలో కరెంట్ సరిగా లేక ఒక్క పంట కూడా సరిగ్గా పండేది కాదు. ఇప్పుడు రెండు పంటలు పండిస్తున్నాం. కాంగ్రెసోళ్లు ఇస్తామంటున్న మూడు గంటల కరెంటుతో ఓ మూల కూడా పారదు. అదేదో 10హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని చెబుతుండ్రు. ఇప్పుడు ఆ మోటరు అవసరమే లేదు.

- దుంపల బాలయ్య, రైతు, సీతాయిపల్లి, గాంధారి

రెండు పంటలు పండిస్తున్నాం

గాంధారి, నవంబర్ 20: కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి 24గంటలపాటు నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తుండడంతో రెండు పంటలు పండిస్తున్నాం. గతంలో కరెంట్ సరిగ్గా రాకపోవంతో పంటలు ఎండిపోయేవి. మోటర్లు కాలిపోయేవి. దీంతో చాలా నష్టపోయేవాళ్లం. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే పాత రోజులే వస్తాయి. పంటలు ఎండిపోతాయి. అసలు వ్యవసాయం చేసుడే చాలా ఇబ్బంది అవుతుంది. రైతుల సంక్షేమాన్ని తలచే కేసీఆర్ ఉండేనే.. ఎవ్వసాయం పండుగ అవుతుంది. కాంగ్రెసోళ్లు వస్తే ఎవ్వసం దండుగే అన్న పరిస్థితి వచ్చే ప్రమాదం ఉన్నది.

- రొడ్డోళ్ల గంగాధర్, సీతాయిపల్లి, గాంధారి

10 హెచ్‌పీ.. దండుగే

రైతులను అప్పుల పాలుజేసుడే..

పొలాల దగ్గర 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే పైసలు ఎవర్లు ఇస్తారు. ఒకవేళ పెట్టినా.. 10హెచ్‌పీ మోటరుకు నీళ్లు సరిపోక అది ఎలాగైనా కరాబైతది. అప్పుడు రిపేర్‌కు పైసలు కావాలె. మెకానిక్ ఉత్త పుణ్యానికే రిపేర్ చేస్తడా? ఇవన్నీ రైతులకు ఇబ్బందులు కావా? కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో రైతులను అప్పులపాలు చేయాలని చూస్తున్నారు.

- పట్లోళ్ల కిషన్‌రెడ్డి, రైతు, సోమార్‌పేట్

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవు..

ఎల్లారెడ్డి, నవంబర్ 20: కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు. కర్ణాటకలో ప్రస్తుత పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. మూడు గంటల కరెంట్‌తో ఆర ఎకరం కూడా నీళ్లు పారవు. అంతలోనే కరెంటు పోతది. మళ్లీ కరెంటు వచ్చే సరికి కథ మొదటికి వస్తుంది. పొరన గంటలనే మళ్లీ పారుతది. ఇదే కథ నడుస్తుంది. పొలమంతా నీళ్లు పారాలంటే ఒక్క రోజుల అయ్యే పని నాలుగు రోజులు అయితది. వ్యవసాయం గురించి అవగాహన ఉన్నోళ్లయితే 3గంటల కరెంటు సరిపోతుందని చెప్పడం మూర్ఖత్వమే అవుతుంది.

- నీలం వెంకట్రాంరెడ్డి, సోమార్‌పేట్

ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

- రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమంటున్న రైతాంగం
- 10హెచ్‌పీ మోటర్ల భారం ఎవరు మోస్తారని ప్రశ్న
- ధరణి ఎత్తేస్తామంటున్న కాంగ్రెస్‌పై కర్షకుల కన్నెర్ర
- దళారుల రాజ్యం తెచ్చేందుకే కుట్రలు
- పోర్టల్ తీసేస్తే ఆత్మహత్యలే గతి అని ఆవేదన
- హస్తానికి ఓటు.. అభివృద్ధికి చేటు అంటున్న రైతులు

బొక్క బోర్ల వడుడే..

నిజామాబాద్, నవంబర్ 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి):

రైతే రాజు అన్న విషయాన్ని గుర్తించిన భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ 2014లో అధికారంలోకి రాగానే మొట్టమొదటగా రైతు, వ్యవసాయాభివృద్ధిపైనే దృష్టి సారించారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటలను పునరుద్ధరించారు. తూములు మరమ్మతు చేయించారు. జల సిరులను ఒడిసి పట్టి సాగుపై ఆధారపడి జీవిస్తున్న వర్గాలను కంటికి రెప్పలా కాపాడారు. రైతుబంధు, రైతుబీమా, పంటల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఉచిత విద్యుత్ వంటివి తీసుకువచ్చి బక్కబల్చాని రైతు బలపడేలా మార్చారు. నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందిస్తూ రైతులకు రక్షణగా నిలిచారు. రైతుకు ఇష్టమైన సమయంలో పొలానికి నీళ్లు పారించుకునే వెసులుబాటు కల్పించారు. విజయవంతంగా సాగుతున్న ఉచిత కరెంట్‌పై అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ కుట్రలకు పాల్పడుతున్నది. కేసీఆర్ అవలంబిస్తున్న విధానాలపై విషం చిమ్ముతూనే రైతుల జీవితాలతో చెలగాటం ఆడేలా ప్రయత్నిస్తోంది. 3గంటల కరెంట్ సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లతోనే పొలాలకు భూగర్భ జలాలను పారించుకోవచ్చంటూ ఉచిత సలహాలు అందిస్తూ రైతును ఆగమాగం చేస్తున్నది. మరోవైపు రైతుల భూములకు కొండంత ధైర్యంగా ఉన్న ధరణి పోర్టల్‌ను సైతం తీసేస్తామంటూ కర్షకుడి సాగు భూములకు కిరికిరి పంచాయితీలు పెడతామన్నట్లుగానే కాంగ్రెస్ నడుం బిగించింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ నేతలు చెబుతున్న కల్లబొల్లి మాటలు, అసంబద్ధమైన హామీలపై రైతులతో తెలంగాణ'' మాట్లాడగా వారంతా దుమ్మెత్తి పోస్తున్నారు. 10హెచ్‌పీ మోటర్లతో బొక్కా బోర్ల పడడే తప్పా ప్రయోజనం ఏమిటని రైతులు అంటున్నారు. ధరణి తీసేస్తే సామాన్యుల భూములకు రక్షణ ఏముంటుందని ఆందోళన చెందుతున్నారు.

నెత్తి ఉన్నోడు మాట్లాడతాడా?

మెడకాయ మీద తలకాయ ఉన్నోడెవడూ వ్యవసాయానికి 3గంటల కరెంట్ సరిపోతుందని మాట్లాడరంటూ రైతులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ లీడర్లకు అసలు వ్యవసాయం గురించే తెల్వదంటున్నారు. 3గంటల కరెంట్ ఇస్తే రోజుకొక్క దొయ్య కూడా తడవదని వివరించి చెబుతున్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి రాష్ట్రంలో రైతులను ఆగం చేసిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రైతుల బాధలు వర్ణనాతీతంగా మారుతాయని అంటున్నారు. రైతు కష్టం తెలిసిన కేసీఆరే సీఎంగా ఉండడంతో దేశంలో మరెక్కడా లేనివిధంగా రైతుకు మేలు చేకూరే పథకాలు అనేకం అమలవుతున్నాయని చెబుతున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ నేతలంతా గిమ్మిక్కులు చేస్తున్నారని వాటిని రైతులు నమ్మి మోసపోవద్దంటూ సూచనలు చేస్తున్నారు. రైతులను ఆదుకునే తెలివే ఉంటే కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు 24గంటల కరెంట్ ఇస్తలేదో చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇక 10హెచ్‌పీ పార్కులూ పేరుతో టీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలను రైతులు తప్పుబడుతున్నారు. సంతోషంగా ఉన్న రైతును రోడ్డు పాలు చేసేందుకు కాంగ్రెస్ ఆడుతోన్న నాటకాలు కర్షకులోకం మండిపడుతున్నది. ఎన్నికల హామీల్లో ఎక్కడా 24గంటల కరెంట్‌పై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం, పదేపదే టీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో సారుకు 3గంటల కరెంట్ సరిపోతుందంటూ చెప్పుకోవడం కుట్రలో భాగంగానే జరుగుతున్న తంతుగానే అన్నదాతలు ఆలోచనలో పడ్డారు.



నకిలీ రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదు..

సదాశివనగర్, నవంబర్ 20: గతంలో దళారులు భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరిగింది. ధరణితో నకిలీ రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండా పోయింది. తహసీల్ ఆఫీసుల్లోనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. గతంలో భూమి కొన్నవారు రిజిస్ట్రేషన్ కోసం వీఆర్వో, వీఆర్ఏ, పట్వారీ, ఆర్ఐ, డిప్యూటీ ఎమ్మార్వో, ఎమ్మార్వో ఇలా ఆఫీసర్ల చుట్టూ తిరిగేవాళ్లు. ఎంత చేసినా కొన్నిసార్లు పైసలు ఇవ్వనిదే యజమానుల పేర్లు మారకపోతుండె. ధరణి వచ్చిన తర్వాత నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పని అయితుంది. ఇంతటి సులభమైన పద్ధతిని కాంగ్రెసోళ్లు వచ్చి తీసేస్తామని, మళ్లీ పాత విధానమే చేస్తామని చెప్పడం సబబు కాదు. రైతుల ముందుకొచ్చి చెబితే తెలుస్తుంది వారి పరిస్థితి. దళారుల రాజ్యం తెచ్చేలా ఉన్న కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చే అవకాశమే లేదు.

- మెడికల్ వెంకట్‌రావు, రైతు, ఉత్తునూరు

ధరణితో దళారుల దందా బంద్ అయ్యింది..

సదాశివనగర్, నవంబర్ 20 : ప్రభుత్వం భూముల కొనుగోలు పట్టాల మార్పిడి కోసం తీసుకవచ్చిన ధరణితో రైతులకు దళారుల బాధ తప్పింది. భూముల రిజిస్ట్రేషన్ కోసం దళారులు ఎంత ఆడిగితే అంత డబ్బులను బాకీ చెప్పి ఇచ్చేవాళ్లం. ధరణి పోర్టల్‌తో రూపాయి ఖర్చు లేకుండా, దళారుల ప్రమేయం లేకుండా ప్రశాంతంగా పనులు పూర్తవుతున్నాయి. నిమిషాల్లోనే రెవెన్యూ అధికారులు పట్టా మార్పిడి చేస్తున్నారు . ఇలాంటి వ్యవస్థనే ఉండాలి. సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణి వ్యవస్థనే బాగున్నది. కొత్త వ్యవస్థ అవసరం లేదు. కాంగ్రెసోళ్లు కూడా అవసరం లేదు.

- గాండ్ల కాశీరాం, రైతు, ఉత్తునూర్

బాధలు కొని తెచ్చుకోం..

ధరణి వచ్చిన తర్వాత రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ అవుతున్నది. గతంలో ఈ సౌలత్ లేదు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే బాగా తిప్పలయ్యేది. మా భూమి మాకు కావాలన్నా.. అమ్మితే రిజిస్ట్రేషన్ చేయాలన్నా పట్వారీల దగ్గరికి పోయి రాయించుకొని వచ్చే ది. ఇప్పుడు ఆ బాధ లేదు. ధరణి వచ్చిన తర్వాత మోసాలు జరగడం లేదు. భూమి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. పట్టా మార్పిడి కూడా అరగంటలోనే అయిపోతుంది. పట్టాదారు పాసు పుస్తకం రైతుల చేతికి వస్తున్నది. ఇంత మంచి వ్యవస్థను తెచ్చిన సీఎం కేసీఆర్‌ను కాదని, వ్యవస్థను నాశనం చేసే కాంగ్రెసోళ్లకు అధికారం ఇస్తామా? ఇచ్చి మళ్లీ బాధలు కొని తెచ్చుకుంటామా? మూడోసారి సీఎం కేసీఆర్ వస్తేనే బాగుంటుంది.

- కయ్యల నర్సయ్య, రైతు ఉత్తునూరు

ధరణి ధర్మం గల్లది

వీఆర్వోల వ్యవస్థ వస్తే రైతులకు కష్టాలు తప్పవు

గాంధారి, నవంబర్ 20: వీఆర్వోల వ్యవస్థ వస్తే మళ్లీ కష్టాలు తప్పవు. భూ రికార్డులకు సంబంధించి వీఆర్వోల వద్దకు, అధికారుల దగ్గరికి వెళితే ముప్పుతిప్పలు పెట్టి రోజులతరబడి తిప్పుకునేవారు. ధరణి వచ్చిన నుంచి గీ బాధలు తప్పినాయి. రైతులకు ఎంతో మేలు చేస్తున్న ధరణిని తీసివేస్తే, మళ్లీ పాత రోజులు వస్తాయి. పైసలిస్తేనే పని జరుగుతుంది.

- సింగసాని సంగమేశ్వర్, సీతాయిపల్లి, గాంధారి మండలం.

ధరణితో మేలు..

గాంధారి, నవంబర్ 20 : కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో రైతులకు ఎంతో మేలు చేకూరుతున్నది. ధరణి రాక ముందు రైతుల భూములకు భద్రత ఉండేది కాదు. ప్రస్తు తం రైతుల భూములకు ధరణితో భద్రత కలిగింది. గతంలో రైతులు భూములు కొనాలన్నా, అమ్మాలన్నా ఆఫీసుల చుట్టూ తిరిగేటోళ్లు. ఇప్పుడు మండల కేంద్రాల్లోని తహసీల్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ధరణిని తీసేస్తే రైతులు మళ్లీ ఇబ్బందులుపడుతారు.

- రాంకిషన్‌రావు, గాంధారి.

ధరణితో భూములకు రక్షణ

గాంధారి, నవంబర్ 20: ధరణి పోర్టల్‌తో రైతుల భూములు భద్రంగా ఉంటున్నాయి. ధరణి రాకముందు అధికారులు, వీఆర్వోలు పైసలు తీసుకొని రికార్డుల్లో ఒకరి భూమిని, మరొకరి పేరుపై మార్చేవారు. గిప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. ధరణి తీసివేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. రైతుల భూములకు రక్షణ లేకుండా పోతుంది.

- పెద్దకాశీరాం, గండివేట్, గాంధారి మండలం.

పైసలిస్తేనే పని జరిగేది..

గాంధారి,నవంబర్ 20: గతంలో భూమి పట్టా చేసుకోవాలన్నా? పహాణీ నకలు తీసుకోవాలన్నా? అధికారులకు పైసలు ఇస్తేనే పని జరిగేది. వ్యవసాయం భూమి అమ్మినా, కొన్నా రోజుల తరబడి అధికారుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరిగేటోళ్లం. పైసలిస్తేనే పని చేసేటోళ్లు. గిప్పుడు గా తప్పులు తప్పినాయి. ధరణి వచ్చిన పుట్టి నుంచి ఒక రోజులోనే భూమి పట్టాలతోపాటు మ్యుటేషన్ అవుతున్నది.

- మేకల శివరాం, గౌరారం, గాంధారి మండలం.

ధరణిని తీసేస్తే రైతులు ఆగమవుతారు

గాంధారి, నవంబర్ 20: రైతులకు ఎంతో మేలు చేస్తున్న ధరణిని తీసేస్తే రైతులు మళ్లీ ఆగమవుతారు. తెలంగాణ రాకముందు కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా? మ్యుటేషన్ చేయించుకోవాలన్నా? నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగి, అధికారుల చేతులు తడపాల్సి వచ్చేది. ధరణి వచ్చిన తర్వాత గా బాధలు తప్పినాయి. ధరణిని తీసేస్తే మళ్లీ ఆ బాధలు మొదలవుతాయి.

- శ్రీకాంత్, రాంలక్ష్మణ్‌పల్లి, గాంధారి మండలం